
తులాభారం
పి.ఎస్.నారాయణ

# తులాభారం

పి. ఎస్. నారాయణ

## నవల

# తులాభారం

## (నవల)

**స్వాతి**

మాసపత్రిక

మే, 2008 సంచిక

అనుబంధ నవలగా

ప్రచురింపబడింది.

**వెల:రు. 80**

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# తులాభారం

దక్షిణామూర్తి గుంటూరు బస్టాండులో తెనాలి వెళ్ళే బస్సు ఎక్కాడు.

అప్పుడు ఉదయం ఎనిమిది గంటలయింది. శీతాకాలపు ఎండ చల్లగా హాయిగా వున్నది.

ఆయన నాలుగు రోజులబట్టీ కూతురు దగ్గరకు వెళ్ళాలని.

గుంటూరుకూ, తెనాలికీ మధ్యలో ఉన్నది సాయీరామపురం. అది అటు పల్లెగాదు, ఇటు పట్నముగాదు... వెయ్యి గడప... చాలామంది భూకామందులే... వాళ్ళను నమ్ముకున్న పనివాళ్ళు... ఇతర వృత్తులవాళ్ళు. ఊరు చిన్నదే అయినా కావాల్సిన ప్రతిదీ దొరుకుతుంది. లేదంటే అటు పక్కన తెనాలి, ఇటు పక్కన గుంటూరు. బస్సెక్కితే యిరవై నిముషాల ప్రయాణం.

దక్షిణామూర్తి బస్సులో కిటికీ పక్కగా కూర్చున్నాడు. బయట వీస్తున్న స్వచ్ఛమయిన గాలికి చలిపుడుతున్నా కిటికీ అద్దాల్ని ముయ్యాలని అనిపించలేదు. ఎటు చూసినా కనులకింపుగా పచ్చటి పొలాలు నిండుగా కోతలకు తయారుగా వున్నయి.

ప్రసూనను చూసి చాలా రోజులయింది. ఎప్పటికప్పుడు వెళ్దామని. కానీ పనుల వత్తిడి కదలనీయటంలేదు. భార్యను కూడా తీసుకు వద్దామనుకున్నాడు... ఇంట్లో మనవడు, మనవరాలు... ఆమెకూ క్షణం వెసలుబాటు వుండదు... ఆపైన కూతురంటే కాస్తంత చికాకు...

తనమాట ప్రతిదీ విన్నట్లుగానే తల ఊపుతుందిగానీ ఆచరణలో మాత్రం పెట్టదు. ఒక్కసారి గుంటూరు వచ్చి వెళ్ళవే అన్నా ఎప్పటికప్పుడు ఏదో సాకు చెబుతుంటుంది. నాలుగుసార్లు చెబితే ఒకసారి వచ్చి, ముళ్ళమీదున్నట్లుగా ఒక రోజో, రెండు రోజులో వుండి– తను లేకపోతే ఆ సాయీరామపురంలో కొంపలంటుకు పోతయ్యన్నట్లుగా

తిరిగి పరుగెత్తుకు వెళ్ళిపోతుంది.

మగుడులేని దానికి అత్తిల్లంటే అంత మక్కువేమిటో అర్థంకాదు. అందుకే దాని మొండి మాటలతీరుకు తను అక్కడకు వెళ్ళటానికి అంతగా ఉత్సాహపడడు.

"అక్కడేమున్నదని నీ విర్రవీగుడు... అత్తిల్లంటే అంత మమకారం దేనికి... తల్లిదండ్రుల మాటగూడా వినిపించుకోక పోవటం, నిర్లక్ష్యం చేయటం...!" అని అన్నాడు అప్పటికీ ఒకసారి.

అది చాలాసేపు మౌనంగా వుండిపోయింది. "చూడు నాన్నా! నన్ను బావకిచ్చి వివాహం చేసేటప్పుడు ఇక్కడ ఏమున్నదో నువ్వు ఆలోచించకుండానే ఇచ్చావా?... అసలు మాటమాత్రం నా అభిప్రాయం అడిగావా? నాకిష్టమో లేదో కనుక్కున్నావా?... బావకు లప్పలకు లప్పలు ఆస్తి వున్నది... నువ్వు ఇక మహారాణివే ఆ యింటికి అంటూ మేనా ఎక్కించావే... అటువంటిది ఇప్పుడు, ఇన్నాళ్ళకు నీకెందుకొచ్చిందా అనుమానం– అక్కడ నాకేమున్నదని... నువ్వన్నట్లుగానే ఆ యింటికి నేను మహారాణినే అయ్యాను... మగుడితో కాపురానికి నోచుకోక పోయినా ఒక్క సారి అత్తింట్లో కాలు పెట్టిన తరువాత ఆ యిల్లే నా యిల్లవ్వాలని, నా భవిష్యత్తంతా ఆ యింటికే అంకితమవ్వాలని మన పెద్దలు రాసిన పుస్తకాలన్నీ ఉద్భోదిస్తున్నయి... నీ కోరిక తీరి నేను దర్జాగా డబ్బులో మునిగి తేలుతున్నప్పుడు– నీకుగాని, అమ్మకుగాని దిగులెందుకు?" అన్నది.

దాని మాటలెప్పుడూ నోటిమీద వాతలు పెట్టినట్లే ఉంటాయి!

కానీ, తను దాని పెళ్ళి చేస్తున్నప్పుడు ఇలా జరగుతుందని కలగన్నాడా? తనకు కన్న కూతురు మీద ప్రేమ ఉండదా? దాని భవిష్యత్తు అంగరంగ వైభవంగా గడిచిపోవాలనే ఆశ ఉండదా?

అందుకే, తన బావమరిది, "పరంజ్యోతికి ప్రసూనానిచ్చి పెళ్ళిచేద్దామనుకుంటున్నాం, మీకు అంగీకారమేనా?" అని అడిగినప్పుడు తను ఒక్కక్షణం ఆలస్యంచేయలేదు. "నీయిష్టం!" అంటూ తల ఊపాడు సంతోషంగా.

స్వంత అత్తయ్య, మామయ్యే దాన్ని తమ ఇంటికి కోడలిగా ఆహ్వానిస్తున్నప్పుడు ఆలోచించాల్సిన అవసరమేమున్నది?

కానీ వివాహమయిన ఆరునెలలు తిరక్కుండానే పరంజ్యోతి అలాంటి పని చేస్తాడని తనేకాదు, ఎవ్వరూ ఊహించలేదు!

నారాకోడూరులో బస్సు ఆగింది... జనం దిగుతున్నారు... కొత్తవాళ్ళు ఎక్కుతున్నారు...

బస్సు మలుపు తిరిగింది. అక్కడకు మరో పదినిముషాల ప్రయాణం.

కూతుర్ని చూస్తే గుండె తరుక్కుపోతుంది.

పెళ్ళయిందని పేరే తప్ప... మగుడితో కాపురం చేసిందే లేదు!

ఆలస్యమయితే అంతమంచి సంబంధం ఎక్కడ చేజారి పోతుందోనని తపనపడ్డాడే కాని– దాని అంతరంగాన్ని, దాని ఆలోచనల్ని తను తెలుసుకోవాలనే ప్రయత్నమే చేయలేదు. చిన్నపిల్ల దానికేం తెలుసులే అనుకున్నాడు.

మేనల్లుడు పరంజ్యోతి బుద్ధిమంతుడు. చక్కటి వాడు. ప్రసూనకు ఈడూజోడుగా వుంటాడు. బాగా చదువుకుంటున్నాడు. అంత చిన్న వయస్సులోనే, పిచ్చిపిచ్చి వేషాలు వేయకుండా దైవభక్తితో ముచ్చటగా కనబడేవాడు– కానీ ఆనాడు తనకేం తెలుసు– అదే ఒకరోజున తన కొంప ముంచుతుందని!

సాయీరామపురం వస్తున్నట్లుగా దూరంగా ఇళ్ళు... ఇళ్ళ చుట్టూ వాటికి ఎల్లప్పుడూ నీడనిస్తూనే ఉండాలి అన్నట్లుగా అన్నివైపులా కొబ్బరిచెట్లు... అవి పట్నంలోని ఇరుకు కొంపలులాంటివి కావు అన్నట్లుగా విశాలమైన ఆవరణలో, చుట్టూ పచ్చదనం నడుమ, పాతకాలంనాటి పెంకునేసిన ఇళ్ళు... చిన్నవైనా శుభ్రమైన రోడ్లు... ఆ ఊరినే కాపలా కాస్తున్నట్లుగా ప్రధాన రహదారి మొదట్లో మర్రిచెట్టు... స్వంత బావులు లేనివాళ్ళకు నీటి ఇబ్బంది లేకుండా నాలుగు గిలకల బావి....

బస్సు రోడ్డు పక్కగా, ఊరి మధ్యలో అందంగా వున్న షెల్టర్ ముందు ఆగింది.

దక్షిణామూర్తి చేతి సంచీతో దిగాడు. అందులో ఉన్న స్టీలు డబ్బానిండా స్వచ్ఛమైన నేతిలో ముంచి తీసినట్లుగా వున్న సున్నుండలున్నాయి. మూత తీస్తే ఘుమఘుమమంటూ ముక్కుల్ని అదరగొట్టేస్తయి. కూతురికెంతో ఇష్టమని  భార్య చేత చేయించాడు. కానీ వాటిని చూస్తూనే అది విసుక్కుంటుందని తనకు తెలుసు- అమ్మను ఈ వయస్సులో కష్టపెట్టి ఇప్పుడు వాటిని చేయించకపోతేనేం- అంటూ...

బస్సు దిగి నలువైపులా చూచాడు.

షెల్టర్ మీద చక్కగా, కుదురుగా రాసిన 'సాయిరామపురం' అన్న అక్షరాలు...

నాలుగడుగులు ముందుకు వేసి, మర్రిచెట్టు పక్కగా పెద్ద వీధిలోకి తిరిగాడు. అటూయిటూ ఇళ్ళు... ఇళ్ళముందు కళాపి జల్లి, వేసిన ముగ్గులు- తనకు గుంటూరు వీధుల్లో కనబడని అందాలు... చిన్నగా అడుగులు వేస్తున్నాడు- ఆయనను ఆహ్వానిస్తున్నట్లుగా తలలూపుతున్న కొబ్బరి చెట్ల నడుమగా ఆ వీధిలో.

తన బావమరిది మహర్షిగారు, ఎప్పుడో కట్టించిన ఇల్లయినా ఇప్పటికీ అది మొన్నీమధ్యనే కట్టించినంత కొత్తగా కనబడుతుంటుంది. దానికి ఆలాంటి పోషణ జరుగుతున్నది మరి. అరడజనుమంది పాలేర్లు ఆ ఆవరణలో ఎల్లప్పుడూ తిరుగుతూ, నేలమీద అనవసరంగా పూచికపుల్ల కనబడ్డా లబలబలాడిపోతుంటారు. ఆయన కావాలనే, నిశ్శబ్దాన్ని కోరుకుంటున్నట్లుగా, గుంటూరు తెనాలి రహదారికి ఫర్లాంగు దూరంలో ఆ యిల్లు కట్టించుకున్నారు. కానీ తరువాత ఊరు పాకిపోయి, రోడ్డుకు అటూ యిటూ మడిగలు లేచి, వాటి వెనగ్గా ఇళ్ళు వచ్చి, ఆ ఊరి స్వరూపాన్నే మార్చివేసినయి.

చేతిలోని సంచీ బరువుగా వుండి చేయిలాగుతోంది.

కూతురి ఇంటి ముందు నిలబడ్డాడు.

కోటద్వారంలా పెద్దవాకిలి. ఇది రాజుగారి కోటగాదు, మనందరిదీ అన్న ప్రజాస్వామ్య సూత్రంలా పగలంతా తెరిచివుండే ద్వారం... తెరిచివున్నయి గదా అని

ఎవ్వరైనా పిచ్చి వేషాలు వేయ ప్రయత్నిస్తే, ఏ కీలుకు ఆ కీలు విడదీసి చేతిలో పెట్టేటందుకు తయారుగా వస్తాదులాంటి కోటిగాడు తలుపు దగ్గరే నిలబడివుంటాడు.

"దణ్ణాలయ్యా!" దక్షిణామూర్తిని చూస్తూనే నమస్కారంపెట్టి ఆయన చేతిలోని సంచీ అందుకున్నాడు వాడు.

లోపలకు వెళ్ళాడు దక్షిణామూర్తి.

వరండాలోనే పెద్ద మేనల్లుడు చైతన్య పడక్కుర్చీలో ఠీవిగా కూర్చొని వున్నాడు. తెల్లటి చలువ చేసిన గుడ్డల్లో హుందాగా వున్నాడు. స్నానమయి పూజయింది అన్నట్లుగా నుదుట కుంకుమబొట్టు... ఇంట్లో తయారయిన చేరడేసి ఇడ్లీలను నేతిలోనూ, కారప్పొడిలోనూ అద్దుకొని, మధ్యమధ్య కొబ్బరి చెట్నీ నంజుకుంటూ, ఓ అరడజను తిని, గ్లాసెడు పాలను త్రాగిన అతడు రెండు గంటల వరకూ ఏ చీకూ చింతా లేదన్నట్లుగా విశ్రాంతిగా కూర్చున్నాడు.

ఎదురుగా గ్రామస్థులు... ఓ పక్కగా కుర్చీలో జగ్గుబాబు... అతడే చైతన్యకు మిత్రుడూ, ఆంతరంగికుడూ, సలహాదారుడూ...

పొలాలు, పంటలూ, కోతలూ మొదలయిన వాటిమీద చర్చ జరుగుతోంది. చేయాల్సిన ఏర్పాట్లమీద అలోచనలు జరుగుతున్నాయి... రేపు రాబోయే మార్కెట్ ధరలమీద సూచనలు... పంట దిగుబడిమీద ఊహలు...

వందెకరాల పొలం మరి... అది గాక వివిధరకాల పండ్ల తోటలూ, అరటి తోటలూ...

చైతన్య దక్షిణామూర్తిని గేటు దగ్గర చూస్తూనే, కుర్చీలోనుంచి లేచి, "రా మామయ్యా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు?..." అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు.

"ఎప్పటికయినా మిమ్మల్ని చూడాలంటే ఈ ముసలాడు రావాల్సిందే తప్ప, సాయిరామపురంలో ఎవ్వరికీ ఒక్క క్షణం తీరికవుండదు... ఏం చేస్తాం చెప్పు!" అన్నాడు నవ్వుతూ మేనల్లుడి చేయి పట్టుకొని చనువుగా.

"అదేం లేదు మామయ్యా.... తప్పకుండా వస్తాను... అత్తయ్య, పిల్లలూ బాగున్నారా?" చిన్నగా అన్నాడు ఆయన ఎప్పుడూ అనే ఆమాటనే వింటూ. "వాళ్ళను గూడా తీసుకు రావాల్సింది."

దక్షిణామూర్తి మెట్లెక్కుతుండగానే లోపల వంట యింట్లో వున్న ప్రసూనకు ఆ వార్త అందింది.

చీర చెంగుకు చేయి తుడుచుకుంటూ వచ్చి, తలుపవతల నిలబడి, "రా, నాన్నా!" అన్నది.

దక్షిణామూర్తి లోపల కాలుపెట్టగానే, చైతన్య వెళ్ళి తన కుర్చీలో కూర్చున్నాడు.

"అక్కడ ఫోనున్నది... ఇక్కడ ఫోనున్నది... బయల్దేరేముందు ఫోను చేస్తే రోడ్డు మీదకు ఎవరినైనా మనిషిని పంపేదాన్నిగదా... ఇంత బరువు డబ్బాను మోసుకు రాకపోతే ఏమైంది... అసలు వద్దామనుకుంటున్నప్పుడు చెబితే గుంటూరుకు జీపు ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతునే వుంటుంది... ఇంటికి వచ్చి తీసుకు వచ్చేది!"

"నిజమేనమ్మా... అక్కడా ఇక్కడా ఫోన్లు ఉన్నమాట వాస్తవమేగాని... నువ్వు రాకపోతే రాకపోయినావ్... కనీసం రెండ్రోజులకొకసారైనా ఒక ఫోనుకొట్టి... నన్ను వదిలేయ్... అమ్మనూ, తమ్ముళ్ళనూ పలకరిస్తున్నావా?" అన్నాడు మనస్సు కష్టపెట్టుకుంటూ.

ప్రసూన మాట్లాడలేదు కొద్ది క్షణాలవరకూ ఆయన నిష్ఠూరపు మాటలకు. తరువాత కోలుకొని, "ఏదీ... చేద్దాం చేద్దాం అనుకుంటూనే వుంటాను... ఏవో పనుల్లో మునిగి తేలటం!" అన్నది ఆయన వంకే జాలిగా చూస్తూ.

"అంటే మేమే అక్కడ పనిలేకుండా పడి ఉన్నామన్నమాట!" కూతురి మాటల్ని తేలిగ్గా తీసుకుంటున్నట్లుగా పెద్దగా నవ్వాడు.

"సరేలే! ముందు కాళ్ళు కడుక్కో... టిఫెన్ తిని, కాఫీ త్రాగుదువుగాని!" అంటూ వెనక్కు తిరిగింది ప్రసూన.

వరండాలో కూర్చొని రైతులతో మాట్లాడుతున్న చైతన్య, వాళ్ళతోటే పొలాలకు వెళ్ళాడు. ఒంటి గంట దాటితేనే గాని తిరిగి రాడు.

ఒక్కసారి వెళ్ళి మంచంలో వున్న అతడి భార్య సత్యవతిని పలకరించి వద్దామా అని ఆమె గది దాకా వెళ్ళాడు. ఆమెను పనిమనిషి స్నానం చేయిస్తున్నదని తెలియటంతో మళ్ళా వెనక్కు వచ్చి మంచం మీద కూర్చున్నాడు కూతురు గదిలో.

సత్యవతికి పెద్ద పిల్ల చారులత పుట్టిన పదిహేడు సంవత్సరాలకు గాని తిరిగి గర్భం రాలేదు. అప్పుడే కవలలు – యిద్దరూ ఆడ పిల్లలు పుట్టారు. ఆ సమయంలోనే ఆమె వెన్నుపూస దెబ్బతినటంతో, మంచంలోనుంచి లేవలేని స్థితి ఏర్పడింది. డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సామాన్యంగా జరగని ప్రమాదం అది.

ప్రసూన టిఫెన్ ప్లేటు తెచ్చి తండ్రికిచ్చి, ఆయన కూర్చున్న మంచానికి దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చున్నది.

“ఏంవిటి నాన్నా గుంటూరు విశేషాలు?” అడిగింది.

ఆయన కూతురు ప్రశ్న పట్టించుకోకుండానే, “నీ వయస్సెంతే?” అన్నాడు స్పూనుతో కాస్త ఉప్మాను ప్లేటులో నుంచి తీసుకొని నోట్లోపెట్టుకుంటూ, ప్రసన్నంగా నవ్వి.

“నీకే తెలియాలి!”

“నాకు తెలుసుకాబట్టే, నీకు గుర్తున్నదో లేదోనని అడుగుతున్నది!”

“తెలిసిన విషయాన్నే తెలుసుకోవాల్సిన అవసరమేమున్నది?”

“ముప్ఫయి ఆరా, ముప్ఫయి ఏడా... అమ్మయితే తిథులు, వారాలు, నక్షత్రాలు గూడా ఖచ్చితంగా చెబుతుంది!”

“రెండింటికీ తేడా ఏమున్నదిలే!” అన్నది నిర్వేదంగా నవ్వి ప్రసూన.

ఆయన కొద్ది క్షణాలు కూతుర్నే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు. ఆమెను చూస్తుంటే, జాలి బాధ కలుగుతున్నాయి ఆయనకు.

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Tulabharam](http://kinige.com/book/Tulabharam)

* * *